సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్, నైబర్ హుడ్, ఊర్జిత 1, 2, గుండ్లపోచంపల్లి, మోడీ బిల్డర్స్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

అంకిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో...

కీసర: అంకిరెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని కీసర విద్యుత్ ఏఈ అనిల్ కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామం, అంకిరెడ్డిపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఏఈ తెలిపారు.

క్లుప్తంగా

'మన ఊరు-మన బడి'కి అంతా సిద్ధం : కలెక్టర్ హరీశ్


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరీశ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ సూచనల మేరకు మన ఊరు–మన బడికి సంబంధించి పాఠశాలల్లో అన్నీ సిద్ధం చేసినట్లు మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ హరీశ్ తెలిపారు. మన ఊరు–మన బడిపై శుక్రవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టర్ హరీశ్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మన ఊరు–మన బడి కార్యక్రమానికి 30 పాఠశాలలను ఎంపిక చేయగా అందులో ఇప్పటి వరకు 25 పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం అన్ని పనులు జరుగుతున్నాయని, ఎక్కడ కూడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా విద్యాధికారిణి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్ఈసీడబ్ల్యూ కళాశాలలో హ్యాకథాన్


హ్యాకథాన్‌ను ప్రారంభిస్తున్న కేసీ చౌదరి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి హ్యాకథాన్ కార్యక్రమాన్ని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి, కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలతలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ అండ్ ఎంటర్‌ప్రీన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ పరిధిలో చేపట్టిన ఈ హ్యాకథాన్‌లో వారు మాట్లాడుతూ.. నూతన సాంకేతిక రంగంలో ఉన్న అవకాశాలు ఎలా వినియోగించుకోవాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి


గర్భిణులకు సామూహిక సీమంతాలు చేయిస్తున్న దృశ్యం

శామీర్‌పేట్: గ్రామాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని యాడారం సర్పంచ్ యాంజాల సుజాత అన్నారు. గౌరీ ఫౌండేషన్ సహకారంతో గ్రామానికి చెందిన గౌరీశంకర్ లేడీస్ ఎంపోరియం దుకాణాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో తన వంతు సహకారం అందిస్తున్న గౌరీ ఫౌండేషన్‌కు సర్పంచ్ సుజాత కృతజ్ఞతలు తెలిపారు. వార్డు సభ్యురాలు ఆండాలు, సంస్థ సభ్యులు పద్మ, మమత, అంగన్‌వాడీ టీచర్ మమత పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై పీఎస్‌లో ఫిర్యాదు

ఘట్‌కేసర్: తెలంగాణ గవర్నర్ తమిళిసైపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కావేరి, ఎంపీటీసీ శోభారాణితో కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రథమ పౌరురాలిని అసభ్య పదజాలంతో దూషించిన ఎమ్మెల్సీని కఠినంగా శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేశ్, మత్స్యేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, బస్వరాజ్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్సీపై ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

బర్తరఫ్ చేయకుంటే.. బయటకే..!

చైర్‌పర్సన్‌ను తొలగించకుంటే తామే తొలగిపోయేందుకు 16 మంది కౌన్సిలర్ల యోచన



- మేడ్చల్ చైరపర్సన్ అక్రమాలను నిరసిస్తూ గత కొన్ని రోజులుగా నిరసనలు
- వారిని బుజ్జగించే పనిలో పార్టీ పెద్దలు
- చైర్‌పర్సన్‌ను దించాల్సిందే అంటూ డిమాండ్
- ఈ నెల 30లోపు తొలగించకుంటే పార్టీని వీడుతామంటూ మంత్రికి అల్టిమేటం
- దగ్గరకు వచ్చిన గడువు



మేడ్చల్: 'చైర్ పర్సన్‌కు హఠావో.. మేడ్చల్‌కు బచావో' అనే నినాదంతో అసమ్మతి గళం విప్పిన మేడ్చల్ మున్సిపల్ అధికార పార్టీ కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్ మున్సిపాలిటీలోని మొత్తం 23 మంది కౌన్సిలర్లలో ముగ్గురు కాంగ్రెస్, ఒకరు బీజేపీకి చెందిన వారు ఉండగా.. మిగిలిన 19 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఉన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లను చైర్ పర్సన్ దీపిక నర్సింహా రెడ్డి ఖాతరు చేయడం లేదని, మున్సిపాలిటీని అవినీతిమయం చేశారని, ప్రజాధనంను దుర్వినియోగం చేస్తున్నారని 16 మంది టీఆర్ఎస్ కౌన్సిలర్లు అసమ్మతి బావుట ఎగురవేసి చైర్‌పర్సన్‌పై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని నెల రోజుల క్రితం జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా పట్టణ, మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు, నిరసనలు నిర్వహించారు. పలుమార్లు వారిని మంత్రి మల్లారెడ్డి సముదాయించినా వారంతా ఏకతాటిపై నిలబడి చైర్‌పర్సన్‌ను కుర్చీ నుంచి దించాల్సిందేనంటూ భీష్మించుకు కూర్చున్నారు. కాగా మంత్రి మల్లారెడ్డి ప్రియ శిష్యుడిగా ఉన్న చైర్‌పర్సన్ భర్త నర్సింహా రెడ్డి మంత్రి అండదండలతో కుర్చీని కాపాడుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

30న డెడ్‌లైన్ విధించిన కౌన్సిలర్లు...

మంత్రి మల్లారెడ్డి అసమ్మతి కౌన్సిలర్లను తన వద్దకు పిలుచుకుని వారిని సముదాయించే యత్నాలు చేస్తున్నా అవి ఫలించడం లేదు. పట్టణ టీఆర్ఎస్ నాయకులను పలుమార్లు రెబల్ కౌన్సిలర్లతో రాచబారం నడిపినా వారంతా చైర్‌పర్సన్‌ను కుర్చీపై నుంచి దించాలనే పట్టుబడటంతో అధికార బీఆర్ఎస్ రాజకీయం వేడెక్కింది. తాము 16 మంది ఏకతాటిపై ఉన్నామని జనవరి 30వ తేదీలోపు ఏదో ఒక నిర్ణయం తీసుకోకపోతే తామే నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. 30వ తేదీ లోపు చైర్ పర్సన్ దీపిక నర్సింహా రెడ్డిని పదవికి రాజీనామా చేయాలని తేల్చి చెప్పారని సమాచారం. మరో రెండు రోజుల్లో కౌన్సిలర్లు విధించిన గడువు ముగియనుండటంతో రాజీనామా చేస్తారా..? చేయరా..? పరిణామాలు ఏవిధంగా ఉంటాయోనన్న చర్చ మేడ్చల్ రాజకీయంలో జోరుగా సాగుతుంది.

ఈ నెల 30వ తేదీతో ముగిసేనా...

మేడ్చల్ మున్సిపాలిటీలో రెండు నెలలుగా బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న ఈ అనిశ్చితి జనవరి 30వ తేదీతో ముగుస్తుందా..? లేదంటే రాజీనామాల వరకు వెళ్తుందా.. అనేది ఆసక్తిగా మారింది.

రాజీనామా చేస్తే సరే.. లేదంటే మూకుమ్మడి రాజీనామాలే..

తాము విధించిన గడువులోపు మంత్రి మల్లారెడ్డి చైర్‌పర్సన్‌ను పదవికి రాజీనామా చేయిస్తే సరే.. లేదంటే తమ బాట తాము చూసుకుంటామని అసమ్మతి కౌన్సిలర్లు గట్టిగా చెబుతున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు మంత్రికి 16 మంది కౌన్సిలర్లు కావాలో.. ఒకరిద్దరు కావాలో.. తేల్చుకోవాలని సవాల్ చేస్తున్నారు. 30వ తేదీ వరకు మంత్రి ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే 16 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయాలని నిశ్చయించుకున్నట్లు తెలిసింది. దూతలుగా వచ్చిన పార్టీ నాయకులకు కౌన్సిలర్లు ఇదే విషయంపై క్లారిటీ ఇచ్చినట్లు తెలిసింది. తాము మేడ్చల్ అభివృద్ధి కోసం పోరాడుతున్నామని మంత్రికి తాము కావాలో.. ఒకరిద్దరు కావాలో.. ఆయనే తేల్చాలని కౌన్సిలర్లు చెప్పుకొస్తున్నారు.

కౌన్సిలర్ల పనితనం అభినందనీయం : మంత్రి


చైర్మన్ కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లతో కలిసి ప్రగతి సంచికను విడుదల చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

పోచారం: అభివృద్ధి కోసం సైనికుల్లా కౌన్సిలర్లు పని చేస్తున్న తీరు అభినందనీయమని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం పోచారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌ను ప్రారంభించిన అనంతరం చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌన్సిల్ హాల్ నిర్మాణానికి రూ.60 లక్షలు వెచ్చించామని, పోచారం మున్సిపాలిటీలోని ప్రతి వార్డుకు రూ.కోటి పైగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కౌన్సిల్ పాలక పగ్గాలు చేపట్టి మూడేళ్లు పూర్తయినప్పటికీ మొదటి రెండేళ్లు కరోనాతో సతమతమైన సంగతి తెలిసిందేనన్నారు. పాలక మండలి 3వ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి, మున్సిపాలిటీ మూడేళ్ల ప్రగతి సంచికను మంత్రి ఆవిష్కరించారు. సమావేశంలో రూ. 24.50 లక్షల వ్యయంతో ప్రవేశ పెట్టిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, కౌన్సిలర్లు గొంగళ్ల మహేష్, బద్ధం మమత జగన్మోహన్‌రెడ్డి, ఆకిటి శైలజ, సామల శ్రీలత, మెట్టు బాల్‌రెడ్డి, చింతల రాజశేఖర్, హరిప్రసాదరావు, అబ్బవతిని సరిత, కోఆప్షన్ సభ్యులు దాసరి శంకర్, అక్రమ్ అలీ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కీసర: మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో శుక్రవారం ఏఐజీ హాస్పిటల్ గచ్చిబౌలి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ పిడిచట్టి పెంటయ్య ప్రారంభించారు. శిబిరంలో గ్రామస్తులకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు చేసిన వైద్యులు అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు శుభంకర్, వినీత్, ప్రసన్న, ప్రవలిక పాల్గొన్నారు.


శామీర్‌పేట్‌లోని లియోనియా రిసార్ట్స్‌లో శుక్రవారం జరిగిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలమల్లేష్ కుమారుడు నిశాంత్, సీనియర్ జర్నలిస్ట్ అంజన్ కుమార్ కుమార్తె భావనల వివాహ వేడుకలో సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, జాతీయ సమితీ సభ్యుడు వెంకట్‌రెడ్డి, బీకేఎంయూ జాతీయ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య తదితరులు. - శామీర్‌పేట్

ప్రధాని 'పరీక్షా పే చర్చ'లో విద్యార్థులు


అత్వెల్లి పాఠశాలలో ప్రధాని ప్రసంగాన్ని తిలకిస్తున్న విద్యార్థులు

మేడ్చల్: పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను ఉద్దేశించి దేశ ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం ప్రసంగించిన ప్రసంగాన్ని మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు తిలకించారు. వివిధ పాఠశాలలో టీవీలు ఏర్పాటు చేసి ప్రధాని కార్యక్రమం పరీక్ష పే చర్చ కార్యక్రమ సందేశాన్ని ఆసక్తిగా విన్నారు. కార్యక్రమాలలో బీజేపీ నాయకులు మోహన్‌రెడ్డి, ప్రేందాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, జగన్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

కీసరలోని జెడ్పీహెచ్ఎల్‌లో...

కీసర: ప్రధాని నరేంద్రమోదీ విద్యార్థులతో నిర్వహించిన పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు చేసిన దిశానిర్దేశం కార్యక్రమంలో కీసరలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు విద్యార్థులు పాల్గొని తిలకించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బీజేపీ నేతలు బండారు శ్రీనివాస్ రెడ్డి, చినింగని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ విగ్రహాన్ని మేమే ఏర్పాటు చేశాం'

కీసర: కరీంగూడ గ్రామంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని తాము ఏర్పాటు చేస్తే దానిని పంచాయతీ పాలకవర్గం ఏర్పాటు చేసినట్లు ప్రచారం చేసుకోవడం సమంజసం కాదని కాంగ్రెస్ సీనియర్ నేత సింగిరెడ్డి రాంరెడ్డి అన్నారు. రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని కరీంగూడలో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తాము నిర్ణయిస్తే విగ్రహ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని సింగిరెడ్డి పాపిరెడ్డి విరాళంగా అందజేశారని, సింగిరెడ్డిరాంరెడ్డి, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, ఇంద్రాల శంకర్‌రెడ్డి, కందాడి కృష్ణారెడ్డి, రవికిరణ్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి అరుణ్‌రెడ్డి శివరాం రెడ్డి, బల్వంత్‌రెడ్డి తదితరులు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఆర్థికంగా సహకరించారన్నారు.

విలువలతో కూడిన విద్యనందించడమే 'విజ్ఞాన' ధ్యేయం




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిఖిల్ చక్రవర్తి

ఘట్‌కేసర్: విలువలతో కూడిన విద్యనందించమే ధ్యేయంగా విజ్ఞాన ప్రభోనంద ప్రశాంతినికేతన్ స్కూల్ ముందుకు సాగుతోందని పూర్వ విద్యార్థి, ఐఏఎస్ నిఖిల్ చక్రవర్తి అన్నారు. మున్సిపాలిటీలోని కొండాపూర్ విజ్ఞాన ప్రభోనంద ప్రశాంతి నికేతన్ స్కూల్ 45వ వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి నిఖిల్ చక్రవర్త ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విజ్ఞాన విద్యాసంస్థల సీఈఓ బోయపాటి శ్రావణ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2.50 ఎల్ఓసీ పత్రాన్ని శుక్రవారం జవహర్‌నగర్‌కు చెందిన అప్పాల యాదగిరికి అందజేస్తున్న కార్పొరేటర్లు మేకల లలితయాదవ్, ఆలూరి సంగీతరాజశేఖర్, దొంతగాని శాంతికోటేష్‌గౌడ్, గొడుదు వేణు ముదిరాజ్, మకారపు రాజ్‌కుమార్. - జవహర్‌నగర్

భార్యను గాయపరిచిన వ్యక్తికి జైలు

మేడ్చల్: భార్యను కత్తితో పొడిచి గాయపర్చి హింసించిన భర్తకు మేడ్చల్ ఏఎస్‌జే న్యాయ స్థానం రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శామీర్‌పేట్ మండలం దేవరయాంజాల్ గ్రామానికి చెందిన సయ్యద్‌సలీంపాషా(48) 2021 మార్చి 30న తన భార్య జరీనా బేగంతో గొడవపడి కూరగాయాలు కోసే కత్తితో గాయపర్చి హింసించాడు. దీంతో జరీనా బేగం పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి నిందితున్ని మేడ్చల్ ఏఎస్‌జే కోర్టులో హాజరుపర్చగా వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి రమేష్ శుక్రవారం సలీంపాషాకు రెండేళ్ల జైలు శిక్ష రూ.వంద జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు సీఆర్‌పీఎఫ్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

జవహర్‌నగర్: గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్–7 అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం సంతోషకరమని జవహర్‌నగర్ సీఆర్‌పీఎఫ్ స్కూల్ ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి రాజశేఖర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కీసర గుట్ట బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలి

మహాశివరాత్రి ఉత్సవాలపై నిర్వహించిన సమీక్షలో మంత్రి చామకూర మల్లారెడ్డి


కలెక్టర్ హరీశ్, ఇతర అధికారులతో కలిసి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మల్లారెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మహాశివరాత్రి సందర్భంగా కీసర గుట్ట కేసరగిరి శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేసి ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హరీశ్ అధ్యక్షతన జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో ఆలయానికి వచ్చే అవకాశం ఉన్నందున అధికారులంతా బాధ్యతాయుతంగా ఏర్పాట్లు పర్యవేక్షించాలని సూచించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 16 నుంచి 21 వరకు జరుగుతాయని, 18న మహాశివరాత్రి సందర్భంగా జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని త్వరగా దర్శనం కలిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకొనే సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నామని, దీనికి రూ.2 వేలు ఉంటుందని.. నలుగురు వెళ్లేందుకు అవకాశం ఉందని మంత్రి తెలిపారు. భక్తులు శ్రీరామలింగేశ్వర స్వామికి కానుకలు, డబ్బులు ఆన్‌లైన్ పేమెంట్ (గూగుల్పే, ఫోన్ పే, పేటీఎమ్) ద్వారా చెల్లించవచ్చన్నారు. కీసరగుట్టలో 16 నుంచి 21 వరకు ఎలాంటి పాసులు అనుమతించరని, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు వస్తే తప్పకుండా వారికి సంబంధించిన గుర్తింపు కార్డును చూపించిన తర్వాతనే దర్శనానికి అనుమతిస్తారన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్ హరీశ్

కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి నోడల్ అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య వ్యవహరిస్తారని, జాతరలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని కలెక్టర్ హరీశ్ అన్నారు. ఆలయం, ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రతతో పాటు ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేపట్టాలన్నారు. జాతరలో ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులు తమ విధులు సక్రమంగా నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవంతంగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కీసర గుట్ట బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్‌తో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, కీసర ఆర్డీఓ రవి, ఆలయ చైర్మన్ రమేష్ శర్మ, ఈఓ సుధాకర్ రెడ్డి, కీసర సర్పంచ్ మాధురి, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి


పాలకవర్గంతో కలిసి కేక్‌కట్ చేస్తున్న చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: అందరి సహకారంతో దమ్మాయిగూడ మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. మున్సిపాల్ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులందరి సమక్షంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేశారు. అనంతరం కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులందరిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. గత మూడేళ్ల కాలంలో మున్సిపల్ పరిధిలోని 18 వార్డుల్లో సుమారు రూ.108 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టామని, అందులో సుమారు రూ.22.23 కోట్ల నిధులతో సీసీరోడ్లు, అంతర్గత మురికి కాల్వల నిర్మాణాలు, రూ.4.90 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో పార్కుల అభివృద్ధి పనులు, రూ.7.10 కోట్లతో సీవరేజ్ పనులు, రూ.3.18 కోట్లతో విద్యుద్దీకరణ పనులు, ఐవీఎస్ఎంసీ రూ.7.20 కోట్లతో మార్కెట్ యార్డు నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. అదేవిధంగా రూ.55కోట్ల హెచ్ఆర్‌డీసీఎల్ నిధులతో త్వరలో నాగారం, అంబేద్కర్ నగర్ కనెక్టివిటీ రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ స్వామి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

'నారాయణ చెరువును ముంపునకు గురికానివ్వం'


పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: గుండ్లపోచంపల్లి పరిధిలోని నారాయణ చెరువు ముంపు లేకుండా చేసి మున్సిపల్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగిస్తామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. రూ.కోటితో నిర్మిస్తున్న గుండ్లపోచంపల్లిలో నారాయణ చెరువు వరద నీటి కాలువ నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రాములు, కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, శ్రీనివాస్, హేమంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, బాలరాజు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దయాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సంజీవ, రవిందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ద్వారా పేదల కళ్లల్లో వెలుగులు


వృద్ధుడికి కళ్లద్దాలు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి


కంటి పరీక్షను పర్యవేక్షిస్తున్న వైస్‌చైర్మన్ మాధవరెడ్డి

మేడ్చల్: కంటి వెలుగు ద్వారా రాష్ట్రంలో పేదల కళ్లల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం వెలుగులు నింపుతుందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్ఓ శ్రీనివాస్, వైద్య సిబ్బంది, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

ఘట్‌కేసర్: కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని మూడో వార్డులో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగును స్థానిక కౌన్సిలర్ సంగీతప్రభాకర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్ముదిరాజ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, జంగారెడ్డి, లింగస్వామి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీలో...

కీసర: నాగారం మున్సిపాలిటీ 17వ వార్డులోని సత్యనారాయణ కాలనీలో కొనసాగుతున్న కంటివెలుగు వైద్య శిబిరాన్ని శుక్రవారం చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా 121 మంది కంటి పరీక్షలు నిర్వహించి 42 మందికి రీడింగ్ కళ్లద్దాలు, 25 మందికి పర్మినెంట్ కళ్లద్దాలు అందజేశామని వైద్య సిబ్బంది చైర్మన్‌కు తెలిపారు.

దమ్మాయిగూడలో...

దమ్మాయిగూడలో శుక్రవారం నిర్వహించిన కంటివెలుగులో 110 మందికి కంటి పరీక్షలు చేయగా 62 మందికి దూరం, 30 మందికి దగ్గరి చూపు కళ్లద్దాలను అందజేశారు. 16 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

భోగారం గ్రామంలో...

కంటివెలుగు వైద్య శిబిరాన్ని భోగారం గ్రామంలో శుక్రవారం ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకరి కవితాజైహిందర్‌రెడ్డి, వైస్ఎంపీపీ జె.సత్తిరెడ్డి, ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మేడ్చల్ రూరల్‌లో...

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం, శ్రీరంగవరం, డబిల్‌పూర్ గ్రామాల్లో చేపట్టిన కంటి వెలుగు శిబిరం శుక్రవారం కొనసాగగా ఆయా ప్రాంతాల వారు పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డబిల్‌పూర్ గ్రామంలో నిర్వహించిన శిబిరంలో సర్పంచ్ గీత భాగ్యారెడ్డి పాల్గొని కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


కంటి పరీక్షను పర్యవేక్షిస్తున్న వైస్‌చైర్మన్ మాధవరెడ్డి


కంటి వెలుగును ప్రారంభిస్తున్న భోగారం ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ